సాక్షి
మెదక్
మంగళవారం । 26 । డిసెంబర్ । 2023



చర్చిలో గీతాలను ఆలపిస్తున్న ఫాదర్స్

న్యూస్‌రీల్

కార్యకర్తలకు అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): బీఆర్‌ఎస్ కార్యకర్తలకు పార్టీ అండగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నార్సింగి మండలం శేరిపల్లిలో బీఆర్‌ఎస్ కార్యకర్త చెప్యాల గంగారామ్ మృతి చెందగా, భార్య బాలమణికి వారి ఇంటి వద్ద రూ.2 లక్షల బీమా చెక్కు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పార్టీ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు కొండంత అండగా నిలుస్తుందన్నారు. కార్యకర్తలకు రూ.2 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తున్న ఏకైక పార్టీ బీఆర్‌ఎస్సేనని అన్నారు. కార్యకర్తలకు ఎలాంటి పరిస్థితి ఎదురైన కంటిపాపలా కాపాడుకుంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశం, బీఆర్‌ఎస్ నార్సింగి మండల అధ్యక్షుడు కుమ్మరి బాబు, చిన్నశంకరంపేట జెడ్పీటీసీ మాధవిరాజు, వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

రగ్బీ పోటీల్లో జిల్లా జట్లకు రెండు పతకాలు


పతకాలు సాధించిన మెదక్ జిల్లా క్రీడాకారులు

చేగుంట(తూప్రాన్): రాష్ట్రస్థాయి బాలికల రగ్బీ పోటీల్లో మెదక్ జిల్లాకు రెండు పతకాలు లభించినట్లు కోచ్ కరణం గణేష్ రవికుమార్ తెలిపారు. ఈనెల 23 నుంచి రెండు రోజులపాటు ఖేలో ఇండియా అండర్–14, 18 బాలికల పోటీలు జరిగాయన్నారు. అండర్14లో నల్లగొండతో మెదక్ జిల్లా జట్టు తలపడి మూడో స్థానంలో నిలిచి వెండి పతకం పొందారని తెలిపారు. అండర్–18లో హైదరాబాద్‌పై మెదక్ జిల్లా జట్టు 1–0 గోల్స్ తేడాతో గెలిచి కాంస్యం కైవసం చేసుకుందని తెలిపారు. ఈ జట్లకు చెక్కులను తెలంగాణ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దోసపాటి రాము చేతులమీదుగా అందుకున్నట్లు తెలిపారు. కాగా జట్ల సభ్యులను రెఫరీ కరణం మల్లీశ్వరి, రితేష్, మహేశ్, పీఈటీల సంఘం అధ్యక్షుడు నాగరాజు, పీఈటీలు శారద మంజుల హర్షం వ్యక్తం చేశారు.

భూ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

భారతీయ కిసాన్ సంఘ్
అఖిల భారత కార్యదర్శి సాయిరెడ్డి


మాట్లాడుతున్న సాయిరెడ్డి

రామాయంపేట(మెదక్): భూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని భారతీయ కిసాన్ సంఘ్ అఖిల భారత కార్యదర్శి సాయిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక వివేకానంద ఆవాస విద్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. కిసాన్ సంఘ్ రైతుల శ్రేయస్సు కోసం అహర్నిశలూ కృషి చేస్తోందన్నారు. రాజకీయాలకు అతీతంగా సంఘంలో రైతులంతా సభ్యులుగా చేరాలని సూచించారు. సంఘ్ తెలంగాణ ఇన్‌చార్జి నన్నా ఆక్రే మాట్లాడుతూ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పది కిలోల తరుగు తీసి రైతులను తీవ్రంగా నష్టాల పాలు చేశారని ఆరోపించారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలను పూర్తి స్థాయిలో అరికట్టాలని, వాటి తయారీ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి, జిల్లా కిసాన్ సంఘ్ ప్రతినిధులు శ్రీకాంత్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, అనిల్ కుమార్, రైతులు హాజరయ్యారు.

కారులో అల్ప్రాజోలం స్వాధీనం

- ఐదుగురు నిందితుల అరెస్ట్

మెదక్: కారులో అల్ప్రాజోలం తరలిస్తున్న ఘటనలో ఐదుగురు నిందితులను పట్టణ పోలీసులు పట్టుకున్నారు. సీఐ వెంకటేష్ కథనం ప్రకారం.. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో ఒక కారులో ఐదుగురు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు ఈ వాహనాన్ని ఆపి తనిఖీలు చేశారు. రూ. 12 లక్షలు విలువైన నాలుగు కిలోల అల్ప్రాజోలాన్ని స్వాధీనం చేసుకున్నారు. కారులో ఉన్న సంగారెడ్డికి చెందిన చిన్నశేరిగౌడ్, తడ్కల్ సాయిబాబాగౌడ్, కామారెడ్డి జిల్లాకు చెందిన లింగాల రాజాగౌడ్, భూమా విఠల్‌గౌడ్, సికింద్రాబాద్‌కు చెందిన సందుల క్రిష్ణను అరెస్ట్ చేశారు. ఆ మేరకు వారిని విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.


భక్తులనుద్దేశించి సందేశమిస్తున్న సీఎస్‌ఐ చర్చి ఇన్‌చార్జి బిషప్ పద్మారావు

ప్రార్థనలో క్రైస్తవులు



సాక్షి స్టాఫ్ ఫొటో గ్రాఫర్, సంగారెడ్డి

అంబరాన్నంటిన సంబరాలు

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ పండుగ

- దైవ సందేశమిచ్చిన ఇన్‌చార్జి బిషప్ పద్మారావు
- కిక్కిరిసిన సీఎస్‌ఐ చర్చి
- చలిని లెక్క చేయక తరలొచ్చిన భక్తులు

" ఏసు జగత్ రక్షకుడు. ఆయన ఈ విశ్వమంతా నిండియున్నాడు. తాను చూపిన సన్మార్గంలో అందరూ నడవాలి. అప్పుడే అందరికీ సుఖసంతోషాలు కలుగుతాయి'' అని సీఎస్‌ఐ చర్చి ఇన్‌చార్జి బిషప్ కే పద్మారావు ప్రారంభోపన్యాసం ఇచ్చారు. క్రిస్మస్ పండగ సందర్భంగా సీఎస్‌ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆసియాలోనే పెద్ద చర్చి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలి రాగా ఈ ప్రాంతామంతా కిక్కిరిసింది. అయితే ఏసయ్య తమ ప్రార్థనలు మన్నించాలని వారు వేడుకున్నారు.

మెదక్: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్‌ఐ చర్చి సోమవారం జనసంద్రంగా మారింది. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి రెండు, మూడు లక్షల మంది భక్తులు తరలొచ్చారు. దీంతో పట్టణం కిటకిటలాడింది. ఉదయం 4 గంటలకే చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు. చలి తీవ్రతను లెక్క చేయక భక్తులు ఏసయ్య దీవెనల కోసం చర్చి ప్రాంగణంలో బారులు తీరారు. అనంతరం మొదలైన తొలి ఆరాధనలో ఈ లోకంలో సర్వం నిండి ఉన్న కరుణా మయుడు ఏసుప్రభువే మనకు అండ అంటూ డయాసీస్ చైర్మన్ ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ కే పద్మారావు ప్రసంగించారు. ఏసయ్య విశ్వమంత నిండి ఉన్నాడన్నారు. పాపుల పరిరక్షణ కోసం తన ప్రాణాలను అప్పగించిన లోక రక్షకుడు తిరిగి మూడో రోజున లేచాడని చెప్పారు. శాంతి ద్వారానే సమసమాజ స్థాపన జరుగుతోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ క్రీస్తును ఆరాధించాలని కోరారు. విశ్వాసంతో ప్రార్థిస్తే ప్రతి సమస్యకు పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. ఏసయ్య పశువుల పాకలో జన్మించటం ప్రపంచంలో ప్రేమ, దయ, కరుణ శాంతిని నింపుటకేనన్నారు. పాపులను రక్షించడానికే శిలువ ఎక్కారని చెప్పారు. అలెగ్జాండర్ లాంటి చక్రవర్తుల సమాధులను మూసి వేసినప్పటికీ ఒక్క ఏసయ్య సమాధి మాత్రమే తెరచి ఉంటోందని చెప్పారు. లోకమంతా ప్రభువు చూపిన మార్గంలో నడుస్తూ సుఖసంతోషాలతో విరాజిల్లాలని వేడుకుంటూ ప్రార్థనలు చేశారు.

చర్చి క్యాలెండర్ విడుదల

అంతకు ముందు చర్చి 99 ఏళ్లు పూర్తి చేసుకుని 100వ ఏటా అడుగు పెడుతున్న సందర్భంగా దశాబ్ది ఉత్సవాల సందర్భంగా చర్చి క్యాలెండర్‌ను ఆయన, మరికొందరు మత గురువులు, బోధకులు విడుదల చేశారు. అనంతరం రెండో ఆరాధనను చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య ప్రారంభించారు. లక్షలాదిగా తరలొచ్చిన భక్తులనుద్దేశించి దైవ సందేశాన్ని ఇచ్చారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను మతగురువులు ఆశీర్వదించారు. కాగా పరలోక ప్రభువుకు ఇష్టమైనా గొర్రెపిల్లలను బహూకరించేందుకు భక్తులు వాటితో తరలి వచ్చి మొక్కులు తీర్చారు.

కిక్కిరిసిన జనం


గీతాలను ఆలపిస్తున్న భక్తులు

సీఎస్‌ఐ చర్చికి జనం తరలి రాగా ప్రాంగణమంతా కిక్కిరిసింది. ఆరు వందల ఎకరాల్లో ఉన్న ప్రాంగణాన మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం వరకు రద్దీ నెలకొంది. భక్తులను అదుపు చేసేందుకు పోలీసులు ప్రత్యేక చొరవ చూపారు. తప్పిపోయిన పిల్లలను పోలీస్ కంట్రోల్ రూంకు తీసుకు వచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. దొంగలు ఉన్నారు జాగ్రత అంటూ ఎప్పటికప్పుడు అందరినీ అప్రమత్తం చేశారు. ఎలాంటి అవాంఛనీయం సంఘటనలు జరగకుండా అదనపు ఎస్పీ మహేందర్ ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటు చేశారు. ఐదు జిల్లాలకు చెందిన పోలీసులు 535తో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. చర్చి లోపల, చుట్టూ, జనం తాకిడి అధికంగా ఉన్న చోటా సీసీ కెమెరాల ద్వారా నిఘా ఉంచారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు గావించారు.

ఎల్‌ఈడీ స్క్రీన్ల ఏర్పాటు

చర్చి లోపల ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ, శాంతా క్లాజ్‌లు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వారి సౌకర్యార్థం ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చర్చి ఇన్‌చార్జి ఫాస్నెట్ క్యాథాడ్రల్ సభ్యులు సందీప్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

• ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి


కేక్ కట్ చేస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): ప్రజలందరూ సుఖ సంతోషాలతో గడపాలని ఏసు క్రీస్తును ప్రార్థించినట్లు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఇండిపెండెంట్ బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ రుబెన్ ఆధ్వర్యంలో పండగ సంబురాలు నిర్వహించారు. ప్రభాకర్‌రెడ్డి హాజరై క్రిస్మస్ కేక్ కట్ చేశారు. పాస్టర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దుబ్బాక ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ సబిత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుమ్మరి బాబు, రోమాల రాజు, ప్రభాకర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

• క్రిస్మస్ వేడుకల్లో సునీతారెడ్డి

నర్సాపూర్: స్థానిక సీఎస్‌ఐ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ఆమె కేక్ కట్ చేశారు. అనంతరం క్రైస్తవులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. చర్చి ఫాదర్ రెవరెండ్ దార సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక ప్రార్థనలు జరుగగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి ఉసిరికపల్లి కొట్టాల చర్చిలో సోమవారం రాత్రి నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్యెల్యే సునీతారెడ్డి పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, ఫాస్టర్ కరుణాకర్ ఉన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

• చర్చి అభివృద్ధికి ప్రాధాన్యం


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్: సీఎస్‌ఐ చర్చి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మైనంపల్లి డాక్టర్ రోహిత్‌రావు పేర్కొన్నారు. క్రిస్మస్ పండగ సందర్భంగా సోమవారం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రెసిబిటరీ ఇన్‌చార్జి శాంతయ్య ప్రార్థనలు చేసి ఆయన్ను ఆశీర్వదించారు. అనంతరం ఆయన చర్చి ప్రధాన గేటు ఎదుట కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యేను చర్చి నిర్వాహకులు సన్మానించారు.

మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సైతం

మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి వేర్వేగా చర్చిని సందర్శించి ప్రార్థనలు చేశారు. అనంతరం పద్మారెడ్డి కేక్‌కట్ చేశారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీకారం

28 నుంచి ప్రజా పాలన

- ఆరు గ్యారంటీలపై దరఖాస్తుల స్వీకరణకు చర్యలు : కలెక్టర్ రాజర్షిషా



మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ ఆరు గ్యారంటీల అమలు కోసం ఈనెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజా పాలన కార్యక్రమాన్ని చేపట్టిందని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. జిల్లావ్యాప్తంగా అధికారులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సోమవారం అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్, జిల్లా అధికారులతో కలిసి ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. నియోజకవర్గం, మండల, గ్రామస్థాయిల్లో ప్రత్యేక అధికారుల బృందాలను నియమించి, మహాలక్ష్మి , గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, రైతు భరోసా తదితర పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. జిల్లాలో అర్హత కలిగిన వారి కోసం ఈ పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని తెలిపారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణకు ఒక రోజు ముందు ప్రతి గ్రామంలో, వార్డుల్లో దండోరా వేయించి, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు, రెండు దఫాలుగా దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. ప్రభుత్వ సందేశం వినిపించి ఈ కార్యక్రమాలను ప్రారంభించాలని చెప్పారు. ఇందుకోసం గ్రామ, మండలాల్లో ముందస్తు తేదీలు ప్రకటించాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వారికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

11 నుంచి కబడ్డీ పోటీలు

గజ్వేల్: పట్టణంలో రాష్ట్రస్థాయి మెగా కబడ్డీ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నా యి. పట్టణంలోని ఐఓసీ (ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) వెనుక భాగంలోని మైదానం వేదికగా వచ్చే నెల 11నుంచి 14వరకు ఈ పోటీలు జరుగనున్నాయి. 33జిల్లాల నుంచి వెయ్యిమంది జాతీయ స్థాయి క్రీడాకారులు, మరో వంద మందికిపైగా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు పాల్గొనున్నారు. ఆ మేరకు సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్ తెలిపారు.

కేవల్ కిషన్ నిన్ను మరువబోం

నేడు ఆయన 63వ వర్ధంతి

రాచరిక పాలనలో జమీందార్ల ఆగడాలకు బలవుతున్న బడుగు, బలహీన వర్గాల పక్షాన పోరాడారు. వెట్టిచాకిరీతో నలిగిపోతున్న పేదలకు అండగా నిలబడ్డారు. ఎర్రజెండా చేబూని నిజాం జమీందార్లకు కంటిమీద కునుకు లేకుండా చేశారు. ఆయనే కామ్రేడ్ కేవల్ కిషన్. మంగళవారం (డిసెంబర్ 26న) ఆయన వర్ధంతి. ఇదే రోజును ప్రతి ఏడాదీ స్మరించుకుంటూ పొలంపల్లి వద్ద జాతర జరుపుకోవడం ఆనవాయితీ.

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండలం టీ.మందాపూర్ గ్రామానికి చెందిన కేవల్ నారాయణ, మున్నమ్మ దంపతుల కుమారుడు కేవల్ కిషన్. ఉస్మానియా వర్సిటీ నుంచి ఎంఏ పట్టా పొందారు. జోగిపేటలో నిర్వహించిన ఆంధ్ర మహాసభ ఇచ్చిన స్ఫూర్తితో ఉద్యమ బాట పట్టారు. మెదక్ విభా ప్రాంతంలో జరుగుతున్న నిజాం ప్రభుత్వ నియంతృత్వ పోకడలు, జమీందార్ల ఆగడాలపై పేద ప్రజలతో కలిసి తిరుగుబాటు చేశారు.

కాగా, దేశానికి స్వాతంత్ర్య వచ్చిన తర్వాత కూడా పటేల్, పట్వారీ, జమీందారి, పెత్తందారులు పేదలపై తమ కర్కశత్వం చూపుతున్న రోజులవి. ఆరుట్ల రామచంద్రరెడ్డి, కమాబాయి, తరిమెల నాగిరెడ్డి తదితర ఉద్యమ నాయకుల సారథ్యంలో పేదల తరపున పోరాడారు. అంతేకాదు తన తల్లితండ్రుల ద్వారా సంక్రమించిన వందల ఎకరాల భూములను సైతం పేదలకు పంచి ఆదర్శనీయుడయ్యారు. మెదక్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ బాధ్యతలతోపాటు ఉద్యమాలను కొనసాగిస్తున్నారు. అప్పుడు శాసనసభ ఎన్నికల సమయం కావడంతో గ్రామాల్లో పర్యటన చేస్తున్నారు. 1960 డిసెంబర్ 26న మాసాయిపేటలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. అర్ధరాత్రి మెదక్‌కు తిరిగొస్తూ చిన్నశంకరంపేట–చేగుంట మధ్యలో ఉన్న పొలంపల్లి చౌరస్తా వద్ద తాను ప్రయాణిస్తున్న బైక్‌ను లారీ ఢీకొనడంతో మృతిచెందారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఆయన సతీమణి ఆనందబాయి మెదక్ ఎమ్మెల్యే ఎన్నికయ్యారు.


కేవల్ కిషన్ విగ్రహం

పుట్టిన బిడ్డలకు పేరు..

నాడు పుట్టిన బిడ్డలందరికీ కిషన్, కిషనమ్మ అని పేర్లు పెట్టుకుని జనం తమ నాయకుడైన ఆయన్ను స్మరించుకున్నారు. మృతిచెందిన స్థలంలోనే విగ్రహం ఏర్పాటు చేశారు. నేటికీ ఇక్కడ జాతర నిర్వహిస్తుండటం ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం కిషన్ విగ్రహం వద్ద ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బండ ప్రకాష్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించ నున్నారు. ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, రోహిత్‌రావు హాజరు కావాలని ఆ సంఘం నేతలు కలిసి కోరారు.

క్లుప్తంగా

మల్లన్నకు ఆభరణాల అందజేత


ఆభరణాలు అందజేస్తున్న నగేశ్ నీలిమ

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామికి కొమురవెల్లి గ్రామానికి చెందిన భక్తులు మంకాల నగేశ్ నీలిమ దంపతులు సోమవారం సుమారు రూ.45 వేల విలువగల వెండి శఠగోపం, బంగారు కోరమీసాలను ఆలయ ఈవో బాలాజీ సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో అంజయ్య, ఉపసర్పంచ్ కొండా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి..


కిష్టవ్వ (ఫైల్)

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పందిల్ల కుమ్మరి కుంటలో సోమవారం ప్రమాదవశాత్తు పడి వృద్ధురాలు పూదరి కిష్టవ్వ (72) మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం కిష్టవ్వకు నలుగురు కుమారులు. ఆమె ఒంటరిగా నివసిస్తోంది. సోమవారం బహిర్భూమికని వెళ్లిన కిష్టవ్వ ప్రమాదవశాత్తు కాలు జారిపడి మృతి చెందింది. కొందరు రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆటో ఢీకొని ఒకరికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన మల్లేశ్

కొల్చారం(నర్సాపూర్): బైకును ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మండల కేంద్రం కొల్చారం సమీపంలోని మెదక్ -నర్సాపూర్ జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం .. మెదక్ పట్టణానికి చెందిన మల్లేశ్ తన బైక్‌పై మెదక్ వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేశ్ కాలికి బలమైన గాయాలు తగిలాయి. అతడిని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని కొల్చారం పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి


రాజు బెనియా మృతదేహం

జిన్నారం(పటాన్‌చెరు): ఇటుకబట్టీలో ట్రాక్టర్ నడుపుతున్న సమయంలో అదుపు తప్పి డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామంలో సోమవారం జరిగింది. గుమ్మడిదల ఏఎస్‌ఐ పర్వేజ్ అహ్మద్ కథనం ప్రకారం.. అన్నారంలోని ఎస్‌పీఎస్ ఇటుక బట్టీలో ఒడిశా రాష్ట్రం, బలంగిర్ జిల్లా, తిక్కరపాడ్ గ్రామానికి చెందిన రాజుబెనియా(39) రెండేళ్ల నుంచి డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటుకల తయారీకి కేజ్ వీల్స్‌తో కూడిన ట్రాక్టర్‌ను మట్టిని తొక్కించేందుకు నడుపుతుండడంతో అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో డ్రైవర్ రాజు బెనియా మట్టిలో కూరుకుపోయి మృతి చెందాడు. అతడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఇటుక బట్టీ ఓనర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.

క్రిస్మస్..జోష్

ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా క్రిస్మస్ వేడుకలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జోష్‌తో సాగాయి. సోమవారం క్రైస్తవులంతా అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మెదక్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. మండలాలు, గ్రామాలలోని చర్చిలను శోభాయమానంగా అలంకరించారు. ఆయా చర్చిల పాస్టర్లు విశ్వాసకులకు దైవ సందేశాలిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉత్సాహంగా గీతాలు ఆలాపించారు. కేక్‌లు కట్‌చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.


మెదక్ చర్చిలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ


మెదక్ చర్చిలో ప్రార్థనలు..


ప్రార్థన చేస్తున్న చిన్నారి


దుబ్బాక: క్రిస్మస్ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత



గజ్వేల్‌రూరల్: సబ్బుబిళ్లలపై చిత్రీకరించిన ఏసుక్రీస్తు, వాజ్‌పేయ్ రూపాలు

మెదక్ చర్చి ఎదుట జనం సందడి →




కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు తీసుకుంటున్న జనం


గజ్వేల్‌రూరల్‌లోని అద్భుత బాలయేసు పుణ్యక్షేత్రం


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రార్థనలు చేస్తున్న చిన్నారులు


కాడిపల్లి చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ప్రార్థనలు చేస్తున్న భక్తులు


మెదక్ చర్చి వద్దకు గొర్రె పిల్లను తీసుకువస్తూ..

స్వయం ఉపాధి.. ఆర్థిక వృద్ధి

- రాయితీలపై రుణాలు
- 18,795 మహిళా సంఘాలు
- 695 గ్రామైక్య గ్రూపులు
- వినియోగించుకోవాలి:అధికారులు

పొదుపు సంఘాలలోచేరి మహిళలు పేదరికం నుంచి బయట పడేందుకు ప్రయత్నిస్తున్నారు. స్వయం ఉపాధి దిశగా అడుగులేస్తూ బ్యాంకు నుంచి రుణాలు తీసుకుంటూ చాలా మంది ఉపాధి పొందుతున్నారు. ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కాలన్న లక్ష్యంతో మహిళలు పొదుపు సంఘాల్లో చేరుతున్నారు.

\- సంగారెడ్డి టౌన్


కంది మండలంలో మహిళా సంఘం సభ్యురాలికి మంజూరైన పిండిగిర్నీ

మహిళలకు బ్యాంకు రుణాలు అంతంతమాత్రంగా ఉండడంతో స్వయం ఉపాధికి బాటలు వేసుకోలేకపోతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటు దిశగా వారిని అడుగులు వేయించాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) నిర్ణయించింది. మహిళలకు కిరాణా దుకాణాలు, మగ్గం వర్క్, బ్యూటీ పార్లర్లు, ఆయిల్ మిల్లులు, విస్తరాకుల మిషన్లు, పౌల్ట్రీఫామ్‌లు, టెంట్ హౌస్ నిర్వహణకు ఆర్థిక సాయం అందజేస్తున్నారు. దానికి శ్రీనిధి పథకం ఉపయోగపడుతుంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 2023 సంవత్సరంగాను రూ.676 కోట్లు మహిళా సంఘాలకు అందించారు. గ్రూపులో ఒక్కొరికి రూ.50 వేల నుంచి మొదలుకొని మూడు లక్షల వరకు అందజేస్తున్నారు. గ్రూపులోని అందరి సభ్యులకు కలిపి 20 లక్షల వరకు అందజేస్తున్నారు.

చిరుధాన్యాల యూనిట్లపై సర్వే

ఆహారశుద్ధి యూనిట్లపై ఇప్పటికే సర్వే నిర్వహించారు. వాటి అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించారు. ప్రస్తుతం కొనసాగుతున్న యూనిట్లపై సెర్ప్ కార్యాలయానికి నివేదిక పంపారు. జిల్లాలో మిరప, పసుపు పప్పు మిల్లులు, పాల పదార్థాల ఉత్పత్తి, చిరుధాన్యాలు, నూనె, చిన్న రైస్ మిల్లులు, పాపడాలు, పచ్చళ్ల తదితర యూనిట్‌లు ఏర్పాటు చేసుకుని మహిళలు ఇప్పటికే ఉపాధి పొందుతున్నారు. పీఎం ఫార్మలేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రెన్యూర్ స్కీమ్(పీఎంఎఫ్ ఎంఈ) పథకంలో భాగంగా రాయితీపై రుణాలు మంజూరు చేస్తున్నారు. దీనివల్ల యూనిట్ల విస్తరణకు జిల్లాలో 695 గ్రామైక్య సంఘాలు, 18,795 మహిళా సంఘాలకు సంబంధించిన 8531 గ్రూపులకు నిధులు మంజూరు చేసినట్లు సంబంధితశాఖ అధికారులు వెల్లడించారు.

యూనిట్ల విస్తరణకు ప్రోత్సాహం

మహిళా సంఘాలకు చెందిన సభ్యుల్లో కొందరు ఇప్పటికే ఆహార సంబంధితరంగంలో ఉపాధి పొందుతుండగా ఆహారశుద్ధి యూనిట్ల విస్తరణకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. తద్వారా మరింత మంది మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించనున్నారు. అందుకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక సాయం అందిస్తారు. శిక్షణలు ఇవ్వడం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు వినియోగదారులకు అందుబాటులోకి రానున్నాయి. ఆహారం కల్తీ లేకుండా తయారు చేయడానికి వీలు కల్పిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



మహిళలు గ్రామాలలో ఆర్థికంగా స్థిరపడాలని పేదరిక నిర్మూలనకు మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం రుణాలు ఇస్తోంది. ఫలితంగా వివిధ రకాల ఉపాధి పనులు లభిస్తున్నాయి. మహిళా సంఘాల సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఎంపిక వేసిన మహిళా సంఘాల సభ్యులకు రాయితీ రుణాల కోసం దరఖాస్తులు చేయించడంతోపాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

\- సూర్యారావు, జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి

పురుగు మందు తాగి ఆత్మహత్య

మద్దూరు(హుస్నాబాద్): పురుగు మందుతాగి ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దూల్మిట్ట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. దూల్మిట్ట గ్రామానికి చెందిన సుందరగిరి రాజు(45) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దానికితోడు చాలా రోజుల క్రితం అతడి భార్య చనిపోవడంతో తీవ్ర మనోవేదనతో ఉన్నాడు. ఈ క్రమంలో తన కుమారుడికి భారం కాకూడదని భావించి ఆదివారం ఉదయం పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని సిద్దిపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాజు కుమారుడు సుందగిరి తేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ వ్యక్తి ఉరివేసు కుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇంద్రానగర్‌లో సోమ వారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భూపాల్ పల్లి జిల్లా చెందిన మధుసూదన్(36) ఐదేళ్ల క్రితం జీవనోపాధికి తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్‌కు వలస వచ్చాడు. తన భార్యతో ఓ ఇంట్లో అద్దెకుంటూ కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం అతడి భార్య బయటికు వెళ్లిన సమయంలో గదిలోని ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. మధుసూదన్ తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ సెంటర్‌లో మృత్యువాత


మల్లేశం(ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): చికెన్ సెంటర్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నా ఓ వ్యక్తి ఆ చికెన్ సెంటర్‌లోనే మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన అక్కన్నపేట మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ తాండ్ర వివేక్ కథనం ప్రకారం.. అంతక్కపేట గ్రామానికి చెందిన ఇప్పకాయల మల్లేశం (38) కొన్ని రోజులుగా అక్కన్నపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో అద్దె భవనంలో చికెన్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరిగానే ఆదివారం ఉదయం 6 గంటలకు షాప్‌కు వెళ్లాడు. కాని రాత్రి 10 గంటలు దాటినా ఇంటికి తిరిగి రాకపోవడంతో అతడి భార్య స్వాతి తన మరిది గబ్బెట రాజుకు ఫోన్‌లో సమాచారం అందజేసింది. దీంతో రాజు చికెన్ సెంటర్‌కు వెళ్లి చూడగా అక్కడ విగతజీవిగా పడి ఉన్న మల్లేశాన్ని గుర్తించాడు. మల్లేశం భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివేక్ తెలిపారు.

అనుమానాస్పదంగా మృతి

పటాన్‌చెరు టౌన్: మూత పడిన ఓ పరిశ్రమలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... పారిశ్రామికవాడలో రిలయబుల్ పేపర్ మిల్ పరిశ్రమ కొంత కాలంగా మూత పడింది. పరిశ్రమలో ఉన్న సంపులో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. అక్కడ విధులు నిర్వహిస్తున్న కాపలాదారుడు 23న మృతదేహాన్ని గుర్తించించాడు. సంపులో తలభాగం మాత్రమే మునిగి ఉండడం అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు ఆదివారం కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మంచి పెరగాలి.. చెడు తొలగాలి

- మనసుపై పట్టు ఉండాలి
- గరికపాటి ప్రవచనాల గగనసాటి
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు


గరికపాటికి ఉంగరం బహూకరిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: గరికపాటి ప్రవచనాలు మనసు కుదుట పడేలా చేస్తున్నాయి.. మంచి పెరుగాలి.. చెడు తొలగాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆకాంక్షించారు. సోమవారం రాత్రి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మూడు రోజులుగా కొనసాగుతున్న చాణక్య నీతిశాస్త్రంపై గరికపాటి నర్సింహారావు చేస్తున్న ప్రవచనాల ముగింపు సందర్భంగా ఆయన పాల్గొన్నారు. హరీశ్‌రావు మాట్లాడుతూ... నేడు టీవీల్లో అరాచకం, అశ్లీలం, గొడవలు తప్ప ఏమీ లేవని వాపోయారు. సోషల్ మీడియా ఉదంతాల వల్ల ఆధ్యాత్మికత మర్చిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి సమాజానికి గరికపాటి ప్రవచనాలు చైతన్యం తెస్తాయని చెప్పారు. మనసుపై పట్టు ఉంటే ఏదైనా సాధించవచ్చునని, మనస్సు మీద పట్టు లేకుంటే అష్టాదశ పీఠాలు తిరిగినా దండగేనన్నారు. రామాయణం, మహాభారతం లాంటివి సులభంగా అర్థం అయ్యేలా ప్రవచనాల రూపంలో వివరించారని పేర్కొన్నారు. గరికపాటి ప్రవచనాల గగనసాటి అని అభివర్ణించారు. సినిమా, క్రికెట్, పొలిటికల్ లీడర్స్ కంటే గరికపాటికి ఎక్కువ ఫాలోయింగ్ ఉందన్నారు. మానవ సేవ, మాధవ సేవ లాంటిదని.. వృద్ధులు, తల్లిదండ్రులు, దివ్యాంగులు, ఆపదలో ఉన్న వారికి చేసేసేవ గొప్పదని గరికపాటి ప్రవచనాల అర్థం అన్నారు. సిద్దిపేటలో ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని, తమ సంపూర్ణ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్ రోజాశర్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, నాయకులు శర్మ, సంపత్ రెడ్డి, సాయిరాం అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.


గరికపాటి నర్సింహారావు ప్రవచనాలను వింటున్న ప్రజలు